-ఖరీదైన ప్రాంతంలో ప్లాట్ నిర్మాణం
-ఒక్కోప్లాట్ ఖర్చు రూ.11లక్షలు
-ప్రభుత్వం నుంచి 5లక్షలు సబ్సిడీ
-మరో 6లక్షలు లబ్దిదారుల నుంచి వసూలు
-తొలిదశలో 7,680 ప్లాట్‌లు

హైదరాబాద్,జూలై 20,ప్రభాతవార్త:

మహానగరంలోసొంతింటి కల కంటున్న పేదలకు ప్రభుత్వం అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది.. ఇప్పటికే సొంత స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు ఇస్తున్న సర్కార్.. ఇప్పుడు సిటీలో అసలు ఇండ్ల స్థలమే లేని నిరుపేదలకు అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఉచితంగా స్థలంతో పాటు, ఫ్లాట్ నిర్మించి ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఈ ఇందిరమ్మ ఇండ్లు ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు 11 లక్షల రూపాయల ఖర్చవుతుండగా.. ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల భారీ సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. మిగిలిన 6 లక్షల రూపాయలను లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో తొలిదశలో 7 వేల 680 ఫ్లాట్లు కేటాయించనున్నారు. .రాజేంద్ర నగర్-మైలార్ దేవుల పల్లి (480 ప్లాట్‌లు) 2.మహేశ్వరం -జల్‌పల్లి (480ప్లాట్లు) 3.శేరిలింగంపల్లి -రాయదుర్గం (480ప్లాట్లు) 4.ఇబ్రహీంపట్నం-తట్టి అన్నారం బండ్లగూడ, (480 ప్లాట్లు)5.మల్కాజిగిరి -కౌకూర్(480 ప్లాట్లు,)6.నాంపల్లి- రెడ్ హిల్స్(360ప్లాట్లు), నీలోఫర్ పోలీస్ క్వార్టర్స్(120ప్లాట్లు) 7. ఖైరతాబాద్ -హకీంపేట్ దర్గా (120ప్లాట్లు),8.జూబ్లీహిల్స్-ఎమ్మెల్యే కాలనీ, (360) 9.కార్వాన్- కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్(480), 10.బహదూర్ పురా -నంది ముసలిగూడ (480) 11.అంబర్ పేట్ -సిటీ పోలీస్ లైన్ 480) 12.కూకట్‌పల్లి -కెపిహెచ్‌బి కాలనీ (480),13. మేడ్చల్ - పోచారం ఎల్ఐజి కాలనీ (480),14.కుత్బుల్లాపూర్-గాజులరామారం (480), 15.సనత్ నగర్ -పాటిగడ్డ (480) ,16.సికింద్రాబాద్ -కంటోన్మెంట్ ,మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్ (480) 17.మలక్ పేట్ -గడ్డిఅన్నారం , ఆర్‌అండ్ బీ క్వార్టర్స్ (480)

ఈ పథకానికి అర్హులు ఎవరు?

లబ్దిదారులు కనీసం 10 ఏళ్లుగా హైదరాబాద్‌లోనే నివసిస్తూ ఉండాలి. కుటుంబంలో ఎవరికీ సొంత ఇల్లు కానీ, ప్లాట్ కానీ, ఫ్లాట్ కానీ ఉండకూడదు. ఒక కుటుంబానికి ఒకే దరఖాస్తు.. ఒకే ఫ్లాట్ రూల్ వర్తిస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా కుటుంబ వార్షిక ఆదాయం 6 లక్షల రూపాయల లోపు ఉండాలి.

జూలై 21 నుంచి మీ సేవ కేంద్రాల్లో, అధికారిక వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉచిత స్థలం..రూ.5 లక్షల భారీ సబ్సిడీ

లబ్దిదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఈ పథకం కింద ఉచితంగా స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ. 5 లక్షల భారీ ఆర్థిక సబ్సిడీని నేరుగా అందించనుంది. ఈ రాయితీలు పోను మిగిలిన లబ్దిదారుల వాటా సుమారు రూ. 6లక్షలుగా ఉంటుందని హౌసింగ్ బోర్డు అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే ఎల్ఐజీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుముగా రూ. 100 నిర్ణయించగా, రూ. 10,000 మొత్తాన్ని ఈఎండీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ లక్కీ డ్రా, ఎంపిక ప్రక్రియలో ఫ్లాట్లు రాని వారికి, వారు చెల్లించిన ఈఎండీ రూ. 10 వేల మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి రీఫండ్ చేయనుంది.

హైదరాబాద్ వార్త

అప్పుడు ఓటేసిన ఇప్పుడు ఫారం ఇవ్వలే!

- గేటెడ్ కమ్యూనిటీలల్లో లిస్ట్‌లో ఓటర్ల పేర్లు మాయం
- గతంలో ఓటేసినా..ఇప్పుడు అందని ఫారాలు
- ఆన్‌లైన్‌లోనూ వివరాలు అందుబాటులో లేవని గగ్గోలు
- సరైన అడ్రస్, ఫోటో లేక బిఎల్‌వో వద్దే వేలాది ఫారాలు పెండింగ్

హైదరాబాద్,జూలై 20,ప్రభాతవార్త:

సైబరాబాద్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలలో గత ఎన్నికల్లో ఓటేసిన 20 నుంచి 25 శాతం మంది ఓటర్ల పేర్లు తాజా జాబితాలో మాయమయ్యాయి. సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లు ఆన్‌లైన్‌లో వెతకగా.. నోరిజల్ట్ ఫౌండ్ అని వస్తుంది. దానికి తోడు బీఎల్వోలు ఫారమ్‌లు ఇవ్వలేదని నివాసితులు వాపోతున్నారు. సరైన అడ్రస్, ఫోటోలు లేకపోవడంతో శేరిలింగంపల్లిలో 35 వేలు, రాజేంద్రనగర్‌లో 70 వేల ఫారమ్‌లు బీఎల్వోల వద్దే ఉండిపోయాయి. రాష్ట్రంలో 100 శాతం ఫారమ్‌ల పంపిణీ పూర్తయిందని సీఈవో డేటా చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత ఎన్నికల్లో ఓటు వేసినప్పటికీ సైబరాబాద్‌లోని గేటెడ్ కమ్యూనిటీలలో నివసించే దాదాపు 20 నుంచి 25 శాతం మంది ఓటర్ల పేర్లు సరికొత్త ఓటర్ల జాబితాలో లేకుండా పోయాయి. అంతేకాకుండా ఇప్పటివరకు వారికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు కూడా అందకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్ర

యలో భాగంగా తమ నంబర్ల ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో వెతికినప్పుడు "నో రిజల్ట్ ఫౌండ్"అని వస్తోందని అనేక మంది ఓటర్లు వాపోతున్నారు. ఈసందర్భంగా సైబరాబాద్ ప్రాంతంలోని 68 గేటెడ్ కమ్యూనిటీల సమాఖ్య అధ్యక్షుడైన సాయి రవిశంకర్ మాట్లాడుతూ.. తమ వద్దకు నివాసితుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దాదాపు 22 లక్షల జనాభా ఉన్న ఈ కమ్యూనిటీలలో, గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలోనూ పావు వంతు మంది పేర్లు ఇప్పుడు జాబితాలో కనిపించడం లేదని పేర్కొన్నారు. "గత లోక్‌సభ ఎన్నికల్లో గౌలిదొడ్డిలోని పాఠశాలలో ఓటువేశాను. ఇప్పుడు జాబితాలో నా పేరు కనిపించడం లేదు. నా భర్త, కుమార్తె వద్ద నిశిది కార్డులు ఉన్నప్పటికీ.. ఇప్పటివరకు ఏ బిఎల్వో మా వద్దకు రాకపోవడంతో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు అందలేదు" అని గచ్చిబౌలిలోని ఒక గేటెడ్ కమ్యూనిటీ నివాసి ఆవేదన వ్యక్తం చేశారు.

సరైన ఫోటో అడ్రస్ లేకనే..

మరోవైపు ఓటర్లకు సహాయం అందిస్తున్న సామాజిక కార్యకర్తలు దీనిపై భిన్నమైన కారణాలను వెల్లడిస్తున్నారు. అనేక ఫారమ్‌లలో సరైన అడ్రస్‌లు, స్పష్టమైన ఫోటోలు లేకపోవడం వల్ల ఓటర్లను గుర్తించడంలో బిఎల్వోలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో దాదాపు 35 వేల ఫారమ్‌లు ఇంకా పంపిణీ కాకుండా నిలిచిపోయాయని.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో దాదాపు 70 వేల మంది ఓటర్లను అధికారులు గుర్తించలేకపోవడంతో ఆ ఫారమ్‌లు ఇప్పటికీ బిఎల్వో వద్దే ఉండిపోయాయని ఓ సామాజిక కార్యకర్త వెల్లడించారు. కొంతమంది ఓటర్ల పేర్లు కొత్త పోలింగ్ బూత్‌లకు మారడం వల్ల వెతకడం కష్టమవుతుండగా.. మరికొందరిని అసలు గుర్తించలేకపోతున్నామని బిఎల్వోలు సైతం చెబుతున్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహా సమస్య ఎదురవుతోంది. 88 ఏళ్ల వయోవృద్ధుడైన రామలింగ మూర్తి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఓటు వేసినా ఇప్పుడు తన పేరు జాబితాలో లేకుండా పోయిందని ఆన్‌లైన్‌లో ప్రయత్నించినా ఎర్రర్ వస్తోందని తెలిపారు.

లగ్గానికి సిద్ధమైన బల్కంపేట ఎల్లమ్మ

- నేడు అమ్మవారి కళ్యాణం..ట్రాఫిక్ మళ్లింపులు



సంజీవరెడ్డి నగర్, జూలై 20, ప్రభాతవార్త:

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో నేడు ఎల్లమ్మ అమ్మవారి-జమదగ్ని మహర్షి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు కళ్యాణోత్సవానికి తరలిరానున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం క్యూ లైన్లు, తాగునీరు, అన్నప్రసాదం, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు.అమ్మవారి దివ్య కళ్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానుండగా, ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా అధికారులు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టారు. భక్తులు ట్రాఫిక్ సూచనలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు

బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో జూలై 21, 22 తేదీల్లో జరిగే ఎల్లమ్మ కళ్యాణం, రథోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు తెలిపారు.గ్రీన్‌ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్, ఫతేనగర్, బేగంపేట, ఎస్ఆర్ నగర్ ప్రాంతాల నుంచి బల్కంపేట ఆలయం వైపు వెళ్లే వాహనాలను వివిధ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నారు. అలాగే ఎస్ఆర్ నగర్ ఖిటీఖి జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న ఉప రహదారులు, లింక్ రోడ్లను తాత్కాలికంగా మూసివేయనున్నారు.భక్తుల వాహనాల కోసం ఆర్ అండ్ బీ కార్యాలయం, జీహెచ్ఎంసీ గ్రౌండ్, పద్మశ్రీ అపార్ట్‌మెంట్స్-డీకే రోడ్, ఫతేనగర్ అండర్ బ్రిడ్జి, నేచర్ క్యూర్ హాస్పిటల్, సనత్‌నగర్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.ప్రయాణికులు బల్కంపేట పరిసర ప్రాంతాలను వీలైనంత వరకు నివారించి, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203 626ను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి :మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త

నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుత పార్లమెంట్ మార్చ్ చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర నిరసన వ్యకనతం చేశారు. ఈ మేరకు విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా మంత్రి అజారుద్దీన్‌తో కలిసి సెక్రటేరియట్ ముందు రాజీవ్‌గాంధీ చౌక్ నుండి లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వరకు కాగడాలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నీట్ పరీక్ష పై మౌనం వీడి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో విద్యార్థులు శాంతియుతంగా పార్లమెంటు మార్చ్ చేస్తున్నప్పుడు ఎక్కడ హింసా పద్ధతి చేయలేదని, విద్యార్థులపై పోలీసులతో లాఠీచార్జీ చేయించారని విమర్శించారు. సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న విద్యార్థులు కొట్టండి కొట్టండి అన్నారు తప్ప ఎదురు తిరగలేదన్నారు.ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే

కాగడాలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ తదితరులు

మోదీ ప్రభుత్వం దేశ రాజకీయాల్లో ఈ రోజు చీకటి రోజన్నారు. 'విద్యార్థులను చితకబాదిన సంఘటన దేశ మొత్తం చూసింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రశ్నాపత్రాలు లీకేజ్ వ్యవహారం పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని శాంతియుత నిరసన చేస్తున్నాం. విద్యార్థులపై యువతపై విచక్షణాలహితంగా లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి వాటికి సంఘీభావంగా కాగడాల ప్రదర్శన చేశాం. నరేంద్ర మోదీ ఖబర్దార్.రాముడి పైసలు దొంగతనం, ప్రశ్నాపత్రాల లీకేజీ, దేశంలో అప్రజాస్వామికం నడుస్తుంది'అన్నారు. విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీకి మద్దతుగా ఢిల్లీలో పోరాడుతున్న విద్యార్థుల పక్షాన మద్దతుగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కాగడాల ప్రదర్శనలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

న-రహదారుల ఆక్రమణలు ఆపండి

-హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూలై 20,ప్రభాతవార్త:

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని.. రహదారుల ఆక్రమణలను తొలగించాలని పలువురు సోమవారం జరిగిన హైడ్రా ప్రజావాణిలో పలువురు కోరారు. పార్కుల స్థలాలు, చెరువులు, ప్రజా రహదారులు, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణలు తొలగించడంలో హైడ్రా వేగంగా, పారదర్శకంగా వ్యవహరిస్తోందని.. మా ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ భూములు కాపాడి ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా రక్షించాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్లు 4, 5, 8, 9, 10, 41లో ఉన్న 26 ఎకరాల 16 గుంటల విలువైన ప్రభుత్వ భూమిపై అక్రమ లావాదేవీలు, రెవెన్యూ రికార్డుల ఫోర్జరీ, ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. లావోని పట్టా భూములు చట్టపరంగా బదిలీ చేయరానివని, అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగాయని ఫిర్యాదులో ఆరోపించారు. నిర్మాణ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ భూమిని రక్షించాలని, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.ఇలా సోమవారం నాటి ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు రాగా హైడ్రా కమిషనర్ నేరుగా పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులు అప్పగించారు.

నగరంలో సోమవారం కురిసిన వర్షానికి జలమయమైన రోడ్లు

బిజెపికి మద్దతుగా వ్యవహరిస్తున్నారా?

విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం సిగ్గుచేటు: ఎస్ఎఫ్ఐ

సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం జరిగిన దీక్షను ఉద్యేశించి ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

చిక్కడపల్లి జులై 20 (ప్రభాతవార్త) :

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యా రంగ సంక్షోభం, ఎన్‌టీఏ వైఫల్యాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సాగుతున్న విద్యార్థి ఉద్యమాలకు సంఘీభావంగా సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ చేపట్టిన దీక్ష తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి విద్యార్థి ఉద్యమాలను అణచివేయడం అత్యంత దురదృష్టకరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, కార్యదర్శి టి.నాగరాజు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విద్యా విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులను అరెస్టు చేయించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎవరి ప్రయోజనాలను కాపాడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఎస్ఎఫ్ఐ నిరవధిక నిరాహార దీక్షను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ .. నీట్ , క్యూట్ వంటి జాతీయ పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాల వల్ల దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ఎన్‌టీఏపై విశ్వాస సంక్షోభం ఏర్పడినా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ వ్యవస్థను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేసారు.

దీక్షకు ప్రజాసంఘాల సంఘీభావం - పోలీసుల భగ్నం

ఎస్ఎఫ్ఐ చేపట్టిన ఈ నిరాహార దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తదితరులు హాజరై సంఘీభావం ప్రకటించారు.అయితే, ఈ శాంతియుత కార్యక్రమాన్ని పోలీసులు బలవంతంగా అడ్డుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎస్. రజనీకాంత్, టి. నాగరాజు, ఎం. మమత, డి. కిరణ్, కె. అశోక్ రెడ్డి, విఘ్నేష్, ప్రశాంత్, అభిషేక్, నాగకృష్ణ, రవీందర్, సందీప్, ప్రవీణ్, అర్జున్, శ్వేత తదితరులను అక్రమంగా అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

వాహన చోరీల ముఠాపై ఉక్కుపాదం

-14 కేసులు ఛేదన.. ఇద్దరి అరెస్టు.. 11 ద్విచక్ర వాహనాల స్వాధీనం

నేరేడ్ మెట్, మల్కాజిగిరి కమిషనరేట్ , జూలై 20 ,ప్రభాతవార్త :

వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అలవాటైన నేరస్థుడితో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో వ్యక్తిని నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. లక్షల విలువైన 11 చోరీ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని మొత్తం 14 వాహన చోరీ కేసులను ఛేదించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా అత్వెల్లి గ్రామానికి చెందిన గుడిసె సుశాంత్ అలియాస్ చిన్న (32) కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలు, అప్పులు, వైద్య ఖర్చులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతడు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడు. మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో వరుసగా వాహనాలను అపహరించి, వాటిని తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.ఈ నెల 16, 17 తేదీల రాత్రి నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో వరుసగా నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన నిందితుడు, సోమవారం బండ చెరువు వైపు చోరీ చేసిన యమహా ఎఫ్‌జెడ్ వాహనంపై వెళ్తుండగా సైనిక్‌పురిలోని భవన్స్ కళాశాల సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో అడ్డుకున్నారు. పోలీసులను గమనించిన నిందితుడు వాహనాన్ని వదిలేసి పరారయ్యేందుకు ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు.నిందితుడిని విచారించగా నేరాలను అంగీకరించాడు. అతడి సమాచారం మేరకు చోరీ సొత్తు కొనుగోలు చేసిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల ద్వారా మనోహరాబాద్, పేట్‌బషీరాబాద్, మేడ్చల్, ఆల్వాల్, నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 14 వాహన చోరీ కేసులు ఛేదించినట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు తమ ద్విచక్ర వాహనాలను ఇళ్ల ప్రాంగణంలో లేదా భద్రమైన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని, అదనపు తాళాలు ఉపయోగించాలని, స్టీరింగ్ లాక్ వేయాలని, వాహనంలో తాళాలు వదిలి వెళ్లకూడదని, వీలైతే జీపీఎస్ ట్రాకర్ లేదా దొంగతనం నిరోధక పరికరాలు అమర్చుకోవాలని పోలీసులు సూచించారు. పోలీసు బృందాన్ని అభినందించిన అధికారులుఈ కేసులను ఛేదించి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ బృందాన్ని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) అభినందించారు. డీసీపీ చి. శ్రీధర్ (ఐపీఎస్), ఏసీపీ వి. యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో నేరేడ్‌మెట్ స్టేషన్ హౌస్ అధికారి ఎ. వెంకటయ్య ఆధ్వర్యంలో ఉప పరిశీలకుడు జి. చంద్రశేఖర్, సహాయ ఉప పరిశీలకుడు జాకబ్, పోలీసు సిబ్బంది కె. బాలకృష్ణ, ఎ. గౌత మ్ కుమార్, ఈ. జోరాజు, డి. శ్రీనివాస్, కె. ఉదయ్ కిరణ్, వి. రాఘవాచారి తదితరులు కేసులను ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

అత్తాపూర్ జూలై20,ప్రభాతవార్త :

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ జాగీర్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధాకర్ తన ఇంటి బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో కనిపించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరిశీలించగా, అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. మద్యం బాటిల్‌లో విష పదార్థం కలుపుకుని సేవించడం వల్లే ఈ ఘటన జరిగినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల ఖచ్చితమైన కారణం వెల్లడయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు

ఆటో ఢీకొని రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి

కెపిహెచ్‌బి కాలనీ, జూలై 20, ప్రభాతవార్త :

రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొన్న సంఘటనలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జుహీరాబాద్ లోని శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన నరసింహ (61) స్థానికంగా హైదర్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం జుహీరాబాద్ కు వెళ్లేందుకు హైదర్ నగర

మహాకాళీ అమ్మవారి జాతరకు 200 ఏళ్ల చరిత్ర

-ఘటాల ఊరేగింపులో ఎమ్మెల్యే తలసాని

రాజీగంజ్‌లో నిర్వహించిన ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

బేగంపేట జులై 20,ప్రభాతవార్త

మహాకాళీ అమ్మ వారి జాతరకు 200 సంవత్సరాల చరిత్ర ఉందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం రాత్రి రాణిగంజ్ లో అమ్మ వారి ఘటాల ఊరుగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఘటాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.అనంతరం గటాల నిర్వహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.ఆషాడ మాసం వచ్చిందంటేనే జంట నగరాలలో ఎంతో సందడిగా ఉంటుందని,పేర్కొన్నారు.తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిందని ఆయన గుర్తు చేసారు.ఎమ్మెల్యే వెంట అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్,ఏసూరి మహేష్,మహేష్,రమణ,ప్రేమ్‌కుమార్ యాదవ్, నాగభూషణం, దేశపాక శ్రీనివాస్,వెంకట్‌బాబు తదితరులు ఉన్నారు.

25న జంగల్ విఠోభా మందిర్ రథోత్సవం

ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ పాలకమండలి ప్రతినిధులు

అష్టల్‌గంజ్,జూలై 20ప్రభాతవార్త:

ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా ఉస్మాన్‌షాహిలోని జంగల్‌విఠోభా మందిరంలో ఈనెల 25వ తేదిన రథోత్సవం నిర్వహించడం జరుగుతుందని మందిరం చైర్మన్,మాజీ కార్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్ తెలిపారు.ఆలయంలో పాలకమండలి,వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయానికి దర్శనం కోసం వచ్చేభక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.విఠలేశ్వరబాల భక్త సమాజ్ పాలకమండలి సభ్యులు వి.పాండుయాదవ్,రఘునందన్‌యాదవ్,మాణిక్‌రావు,గోవింద్‌రాజు మహారాజ్,డిప్యూటి కమీషనర్ జిహెచ్‌ఎంసి ఉమాప్రకాష్,ఈఈ రాధిక,ఏఇ తిరుమల్‌రెడ్డి,జలమండలి మేనేజర్ కులశేఖర్,ఎస్‌ఐ నిరంజన్,ట్రాఫిక్,విద్యుత్ శాఖ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సిసి రోడ్డు పనులు



అలియాబాద్ సమీపంలోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు తిరుపతి చందు

మైలార్‌దేవ్‌పల్లి,జూలై 20 ప్రభాతవార్త :

రాజేంద్రనగర్ జోన్ పరిధి అలియాబాద్ సమీపంలోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద మూడున్నర లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు తిరుపతి చందూ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద సిసి రోడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యం

అత్తాపూర్ జూలై20,ప్రభాతవార్త :

నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పించడం లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో 90.20లక్షల అంచనా వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.రాజేంద్రనగర్ డివిజన్ న్యూ గ్రిన్ సీటి కాలనీలో రూ.67.80లక్షలు, బుద్వేల్ సిగ్నేచర్ అపార్ట్‌మెంట్ సమీపంలో 22 లక్షల వ్యయంతో చేపట్టే సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలను నడపరాదు

డ్రంక్ అండ్ డ్రైవ్ చేవదుతున్న గోషామహల్ ట్రాఫిక్ పోలీసు సిఐ రాజు,సిబ్బంది

గోషామహల్,జూలై 20ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనాలను నడపడాన్ని అరికట్టడానికి,రోడ్డుభద్రతను పెంపొందించడానికి గోషామహల్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.నగర ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు గోషామహల్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.ఆరామ్‌ఘర్ ప్రాంతానికి చెందిన మొబైల్ మెకానిక్‌గా పనిచేస్తున్న వాహనాదారుడు శంకర్(28)ను బ్రీత్‌ఆన్‌లైజర్ పరీక్షలో పట్టుబడినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపారు.పరీక్షలో మద్యం సేవించినట్లురక్తంలో ఆల్కహాల్ శాతం 127 ఉన్నట్లు తెలిపారు.అనుమతి మించి అధికంగా ఉండటంతో వాహానాన్నిస్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడాన్ని అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో వైశ్యుల కీలకపాత్ర : శ్రీనివాస్

హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త

గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ వార్షికోత్సవ సభలో పాల్గొన్న డి.శ్రీనివాస్, చోటి ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్ మంచీ తదితరులు

దేశంలో క్రీ.పూ.3వ శతాబ్దం నుండి వ్యాపారులుగా, వర్తకులుగా గొప్ప గుర్తింపు పొందిన వైశ్యులు దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో మరింత కీలక పాత్ర పోషించాలని విజిలెన్సు ఎన్ఫోర్స్మెంట్ ఎస్పి డి.శ్రీనివాస్ అన్నారు.సోమవారం గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ (జీవీబీఎల్) ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సభకు జీవీబీఎల్ వ్యవస్థాపకులు, సిఈఓ రాజశేఖర్ మంచీ అధ్యక్షత వహించగా డి.శ్రీనివాస్ తోపాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, కెపిసి ప్రాజెక్ట్స్ సిఏండి కె.అనిల్‌కుమార్, సుధాకర్ పివిసి డైరెక్టర్ మీలా జయదేవ్ ముఖ్యఅతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజం యొక్క సామాజిక, ఆర్థిక స్థితిని ఉన్నతీకరించడం, హక్కులను పరిరక్షించడం, నైతిక, మేధో, వాణిజ్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రయోజనాలను ప్రోత్సహించడం వంటి లక్ష్యంతో పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే గుణం, అంకితభావం, వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపార చతురతకు నిదర్శనంగా వైశ్యులు భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతూ దేశ జీడీపీ వృద్ధికి కూడా దోహదపడుతున్నారని తెలిపారు.రాజశేఖర్ మంచీ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన తోడ్పాటును అందించడం కోసం వైశ్యులు కలిసి ఎదగడం, ఒకరి పరిచయాలు నెట్‌వర్క్‌ల నుండి ప్రయోజనం పొందడం, భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపారవేత్తలుగా, వ్యవస్థాపకులుగా ఎదగడం అనే లక్ష్యంతో జీవీబీఎల్ ప్రారంభించబడిందని తెలిపారు. ఈ సభలో జీవీబీఎల్ అధ్యక్షుడు జిల్లా ప్రసాద్, ఉపాధ్యక్షులు టీ.క్రాంతి, బి.సంతోష్, టి.శివ, జి.శ్రీనివాస్, జి.నిఖిల్, కె. భరత్ కుమార్, కార్యదర్శి రవి కొండూరి, కోశాధికారి సి.తరుణ్, కార్యవర్గ సభ్యులు కె.వేణు, ఆర్.ప్రసాద్, కృష్ణమోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకున్న సిఎంసి కమిషనర్ సృజన

కొంపల్లి, జూలై 20, ప్రభాతవార్త

కొంపల్లి వార్డులో వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమంలో పాల్గొన్న సృజన

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లి సర్కిల్56 పరిధిలోని కొంపల్లి వార్డులో సోమవారం నిర్వహించిన వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమంలో సీఎంసీ కమిషనర్ జి. సృజన పాల్గొని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీని సందర్శించారు.ఈ సందర్భంగా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధులు, స్థానిక నివాసితులతో సమావేశమై పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి, వర్షపు నీటి పారుదల, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై చర్చించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాధాన్య క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడమే వన్ డే-వన్ వార్డ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, అసిస్టెంట్ మున్సి పల్ కమిషనర్ అల్లం రవికుమార్, డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) డి. విరాట్ రాజ్ కుమార్, డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) ఎం. తిరుపతి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఐ. రాణి, హెచ్‌ఎమ్‌డబ్ల్యూఎస్‌ఎస్‌బీ, విద్యుత్, వాటర్ డిపార్ట్‌మెంట్, యూబీడీ తదితర శాఖల అధికారులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల చేరికతో బలోపేతమైన బిఆర్‌టియూ

చిక్కడపల్లి జులై 20 (ప్రభాతవార్త) : భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ)లో తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్‌కు చెందిన పలువురు నాయకులు సోమవారం చేరారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలీన సభలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్‌కు చెందిన దేవానంద్, రామన్న, ఎయిర్‌టెల్ రాజు, పరమేశ్వర్, హరిబాబు, లక్ష్మణ్, శోభాతో పాటు పలువురు నాయకులు బీఆర్‌టీయూలో చేరారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, కార్మికులు, పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణే పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ లభిస్తుందని విశ్వాసం

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఉద్యోగుల జీతాలు, ప్రమోషన్లు, సంక్షేమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశామని చెప్పారు. పేదలు, కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తెలంగాణ ఉద్యమ లక్ష్యమని పేర్కొన్నారు. సభలో మారన్న, నారాయణ, రాజు యాదవ్, ఆంజనేయులు, రామకృష్ణతో పాటు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు,పాల్గొన్నారు.

ఉమాదేవినగర్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

: కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్

జనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తు ఉమాదేవినగర్ సంక్షేమసంఘం అధ్యక్షులు సమ్మయ్యయాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్నోళ్ల నంజీవరెడ్డి, కాలనీ సంక్షేమసంఘ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జూలై 20 ప్రభాతవార్త

గాజులరామారం సర్కిల్ ఉమాదేవినగర్‌లో సిమెంట్లురోడ్లు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి తక్షణం చర్యలు చేపట్టాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఉమాదేవినగర్ సంక్షేమసంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.సమ్మయ్యయాదవ్, కరుణాకర్‌రాజు, కోశాధికారి శర్వరాల కృష్ణమూర్తిగుప్తా, గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్దన్నోళ్ల సంజీవరెడ్డిలు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సంక్షేమ సంఘ ప్రతినిధుల విజ్ఞప్తిని పరిశీలించిన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ తక్షణం కాలనీలో గల ఎనమిది సిమెంటు రోడ్లును తక్షణం నిర్మించడంతోపాటు కాలనీలో దీర్ఘకాలంగా వాయిదాకు గురవుతున్న కూలిపోయిన ప్రభుత్వపాఠశాల ప్రాహారీగోడ నిర్మాణాన్ని తక్షణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న తనదృష్టికి తేవాలని ఆయన ఉమాదేవినగర్ సంక్షేమ సంఘ ప్రతినిధులకు సూచించారు. ఈసందర్భంగా కాలనీ సంక్షేమసంఘ అధ్యక్ష, కార్యదర్శులు సమ్మయ్యయాదవ్, కరుణాకర్‌రాజు, కోశాధికారి శర్వరాల కృష్ణమూర్తి గుప్తా మాట్లాడుతూ ఉమాదేవినగర్‌లో సమస్యలపై పలుమార్లు విజ్ఞప్తిపత్రాలను సమర్పించినట్లు తెలిపారు. తమసమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించిన జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

భట్ రాజు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా చంద్రశేఖర్ రాజు

చిక్కడపల్లి జులై 20 (ప్రభాతవార్త) : తెలంగాణ రాష్ట్ర యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రతీకంఠం చంద్రశేఖర్ రాజు సోమవారం ఎన్నికయ్యారు. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తెలంగాణ భట్ రాజు భవన్ లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కార్తీక్ రాజు, చంద్రశేఖర్ రాజుల మధ్య హోరాహోరీగా ముఖ్య పోటీ జరిగింది. ఇందులో చంద్రశేఖర్ రాజు అఖండ విజయం సాధించారు. విజయం సాధించిన చంద్రశేఖర్ రాజును భట్ రాజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు విష్ణుభరత్ రాజు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

బాలనగర్‌లో సర్ కార్యక్రమం...

వివరాలు తెలుసుకుంటున్న బండి రమేష్

కూకట్‌పల్లి జూలై 20, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలనగర్ డివిజన్‌లో పులి శివాగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిత్యం అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పులి శివా గౌడ్‌తో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బండి రమేష్ అభినందించారు. కూకట్‌పల్లిలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర ప్రక్రియపై స్థానిక నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలని హోటళ్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, శ్రీకాంత్ పటేల్, తూము వేణు, రామ్మోహన్, మదన్మోహన్, శ్రీకాంత్ గౌడ్, యువజన నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కోసం పోలీసుల ముమ్మర గాలింపు

ముషీరాబాద్, జులై 20, ప్రభాతవార్త:

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి, దోమలగూడలో నివసిస్తున్న టోటారాం, రాందులారి కుమార్తెలు సహితకుమారి (16), స్నేహ కుమారి(14) మరియు రోహిణి కుమార్తె లత (14)లు ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లి పోవటంతో, ఆ బాలికల ఆచూకీ కోసం దోమలగూడ పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి పక్క పక్క ఇళ్లల్లో నివసించే ముగ్గురు బాలికలు కనిపించటం లేదని ఆదివారం దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందకున్న దోమలగూడ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించ గా, శనివారం సాయంత్రం ఇంటి నుంచి బట్టలు సర్దుకుని ఆ టో ఎక్కిన ముగ్గురు బాలికలు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల తరచుగా హైదరాబాద్ తమకు నచ్చటం లేదని, ఛత్తీస్‌ఘడ్ వెళ్లిపోదామని తల్లి తండ్రులతో పిల్లలు చెబుతూ ఉన్నారని, దానిని బట్టి పిల్లలు ఛత్తీస్‌ఘడ్ వెళ్లేందుకు కాచిగూడ స్టేషన్‌కి వెళ్లి ఉంటారని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. బాలికల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశామని, త్వరలోనే బాలికల ఆచూకీ తెలుసుకుంటామని దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపారు.

అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినోత్సవం ..అవగాహన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న డాక్టర్.రాజ్‌నారాయణ ముదిరాజ్,వలువురు ప్రముఖులు

చార్మినార్,జూలై 20 ప్రభాతవార్త : ప్లాస్టిక్‌ను వాడటం వల్ల మానవ ఆరోగ్యానికి పర్యావరణానికి తీవ్రమైన నష్టాలు ,వ్యాధులు సంక్రమిస్తున్నాయని ప్రముఖ పర్యావరణ వేత్త,ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి అన్నారు.తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ సంస్థ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పాతబస్తీ రిఫాయం హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.సుధా టాకీస్ నుంచి నిర్వహించిన ర్యాలీ శాలిబండ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ భూమిలో కరగటానికి వందల సంవత్సరాలు పడుతుందని,దీని వల్ల భూమి,నీరు కలుషితమై భయంకరమైన వ్యాధులకు కారణం అవుతాయని తెలిపారు.ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్.సి.ఉమా మహేశ్వరీ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో వేడి టీ,కాఫీ, ఆహారాన్ని సేవించటం వల్ల క్యాన్సర్,హార్మోన్ల సమతుల్యత,రోగ నిరోధక శక్తి తగ్గటం వంటి అనేక సమస్యలు కలుగుతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ రాష్ట్రశాఖ అధ్యక్షులు డాక్టర్.రాజ్‌నారాయణ ముదిరాజ్,మొగల్‌పుర సిఐ సాయి కుమార్,టిఆర్ఎస్ నాయకులు సిద్దేష్ ముదిరాజ్,టిసిసి కార్యదర్శి మహ్మద్ అక్బర్ షరీఫ్ ,పాఠశాల కరస్పాండెంట్,కార్యదర్శి ఎస్.పుల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె..నీరజ,కార్యక్రమం సలహాదారులు ఎం.పద్మావతి,కోఆర్డినేటర్లు మొహమ్మద్ షాహిద్ అలీ,కె.రవీందర్, జి.వేణు గోపాల్,శ్యాంరావు ముదిరాజ్,బి.సూర్య,పాఠశాల ఉపాధ్యాయులు ఎం.చంద్రకళ,ఆర్.వసంత,ఎస్.వెంకట్ రెడ్డి,పివి ప్రమోద్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

యువత గొంతుకకు కాంగ్రెస్ అండ : బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, జూలై 20, ప్రభాతవార్త

జేఎన్టీయూలో జరిగిన ఛత్తోన్ కీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు భారత జాతీయ కాంగ్రెస్ భారత యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఆడిటోరియంలో నిర్వహించిన ఛత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం యువత, విద్యార్థుల హోరెత్తించిన నినాదాల మధ్య జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ ఇది యువ భారతం యువత భవితనే దేశ భవితని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని, విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని ఆయన విమర్శించారు. ప్రశ్నాపత్రాల లీకులు, నిరుద్యోగం, ఉన్నత విద్యలో అవకాశాల కొరత వంటి సమస్యలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వారి హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాకీర్, రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, బల్మూర్ వెంకట్, తూము వేణు, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, శ్రీనివాస్ బాబు, సాయిబాబా చౌదరి, రంగమోహన్, గంధం రాజు, రాజేష్, శంకర్, పులి శివ గౌడ్, రామారావు, సునీల్, శ్రీకాంత్ పటేల్, మైఖేల్, బాలరాజు, సంధ్య రాణి, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లు కొట్టారు...చెత్త కుప్పల్లో పడేశారు

-దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం : స్థానికులు

ప్రకాశం నగర్ పాత వాటర్ ట్యాంకు వద్ద పేరుకు పోయిన చెట్ల కొమ్మలు.

బేగంపేట జులై 20,ప్రభాతవార్త

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది జీహెచ్‌ఎంసీ అధికారుల పనితీరు.చెట్లు కొట్టారు సరే వాటిని తీసికెళ్లి చెత్త కుప్పల్లో పడేశారు.అవి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో వాటిని తొలగించాలంటూ స్థానికులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.ఇదే ప్రాంతంలో కొద్ది రోజులు డ్రైనేజీలు నిండి రోడ్లపై పారుతుండటం,మరో వైపు చెత్త గుట్టలుగా పేరుకు పోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండటంతో తాము రోగాల బారిన పడుతున్నామంటూ స్థానికులు వాపోతున్నారు.ఈ ప్రాంతంలో గతంలో రోడ్డును ఆక్రమిస్తూ కార్ల పార్కింగ్ చేయడం తో కొందరు కార్ల సందుల్లో చెత్తను పడవేసి వెళ్లే వారని,ఒకరొకరు ఇలా చెత్త వేస్తుండటంతో ఈ ప్రాంతం చెత్తకుప్పల మయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని ఇటీవల కాలంలో కొట్టి వేసిన చెట్ల కొమ్మలు,పేరుకు పోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జరగాలి

బాలనగర్‌లో జరుగుతున్న సర్ కార్యక్రమంలో పాల్గొన్న యుగంధర్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జూలై 20, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గం లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జరగాలనీ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు.బాలానగర్ డివిజన్ లో మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ప్రతి బూత్‌లో పర్యటించి బిఎల్ఓ, బిఎల్ఓలతో కలిసి సర్ కార్యక్రమంలో పాల్గొని ఎన్యుమరేషన్ ఫారమ్‌లపై సుదీర్ఘంగా చర్చించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ

ప్రగతి నగర్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్

ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్, జూలై 20, ప్రభాతవార్త

ప్రగతి నగర్ డివిజన్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) హెల్ప్ డెస్క్‌కు ప్రజలు విశేషంగా హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో ఎలా పూరించాలి, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు ఏమిటి, దరఖాస్తు ప్రక్రియ ఎలా ఉంటుందనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఫారమ్ నింపడంలో ప్రత్యక్షంగా సహాయం అందించి, అవసరమైన మార్గదర్శకాలను సూచించారు.ఈ సందర్భంగా రచ్చ చక్రధర్ మాట్లాడుతూ ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు బీజేపీ హెల్ప్ డెస్క్ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మంత్రి హోదా పొందిన అద్దం దయాకర్‌కు అభినందల వెల్లువ

అద్దంకి దయాకర్‌ను సత్కరిస్తున్న అమృతం వీరా

సైఫాబాద్, జులై 20 ప్రభాతవార్త: రాష్ట్ర శాసన మండలి సభ్యుడు, ప్రభుత్వ విఫ్, తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదాను ప్రకటించడం పట్ల ఆనేక మంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. సోమవారం అద్దంకి దయాకర్ నివాసానికి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అమృతం వీరా, రాష్ట్ర నాయకులు సుధీర్‌కుమార్, రాజుయాదవ్, అయూబ్‌ఖాన్ తదితరులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అమృతం మీరా మాట్లాడుతూ సేవా భావం కలిగిన అద్దంకి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు స్వీకరించి ప్రజలకు సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

రంగస్థల దర్శక పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపేట్, జూలై 20, ప్రభాతవార్త

తెలంగాణలో రంగస్థల కళారంగానికి విశిష్ట సేవలు అందించిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, రచయిత పి.వి. రమణ స్మారకార్థం 2026 సంవత్సరానికి "పి.వి. రమణ రంగస్థల పురస్కారం"ను ప్రదానం చేయనున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ రాధ సారంగపాణి సోమవారం ఓ ప్రటన ద్వారా తెలియజేశారు. తెలుగు రంగస్థల అభివృద్ధికి విశేష కృషి చేసిన రచయితలు, నాటకకర్తలు, పరిశోధకులు, నటీనటులు, రంగస్థల దర్శకులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి ఏడాది ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రంగస్థల దర్శకుడు విభాగంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రంగస్థల దర్శకులు ఈ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలతో కూడిన బయోడేటా, రంగస్థల రంగంలో చేసిన సేవలకు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలు, ఇతర సంబంధిత పత్రాలను జతచేసి 2026 ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణంలోని రంగస్థల కళల శాఖకు సమర్పించాలని సూచించారు.గడువు అనంతరం అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. పురస్కారానికి సంబంధించిన నిబంధనలు, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖను సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ రాధ సారంగపాణి సూచించారు.

ముషీరాబాద్ యూపీహెచ్‌సీ డాక్టర్ మనోజ్‌రెడ్డికి బెస్ట్ డాక్టర్ అవార్డ్

పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, జులై 20, ప్రభాతవార్త: ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (యూపీహెచ్‌సీ ముషీరాబాద్)లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డికి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మక బెస్ట్ డాక్టర్ అవార్డ్‌తో పాటు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అందచేశారు. వైద్యరంగంలో ఆయన చేస్తున్న నిరంతర సేవా భావం, రోగుల పట్ల ఆయన చూపుతున్న కరుణ, అత్యున్నత వృత్తి నిబద్ధత, సమర్థవంతమైన నాయకత్వం మరియు సమాజ ఆరోగ్యాభివృద్ధికి చేస్తున్న విశేష కృషిని గుర్తించి, ఈ గౌరవాన్ని లయన్స్ ఇంటర్నేషనల్ వారు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను చేస్తున్న వైద్య సేవలను గుర్తించి, తనను ప్రోత్సహిస్తూ అవార్డు అందచేసిన లయన్స్ ఇంటర్నేషనల్ వారికి ధన్యవాదములు తెలియచేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సన్నిహితులు, స్థానిక ప్రజలు డాక్టర్ మనోజ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలయచేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆటోల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలి: అమానుల్లా ఖాన్

సమావేశంలో మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

సైఫాబాద్, జులై 20 ప్రభాతవార్త: కొత్త ఆటో షోరూంల డీలర్లు, ప్రైవేటు ఫైనాన్షియర్లతో కుమ్మకై ప్రత్యక్షంగా, పరోక్షంగా చేస్తున్న కొత్త ఆటోల బ్లాక్ మార్కెటింగ్‌లను తక్షణమే అరికట్టాలని మహాత్మా గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్‌కు వినతి పత్రాలను సమర్పించడం జరిగిందని సోమవారం ఎన్ఎస్ఎస్‌లోఏ ర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు.కొత్త ఆటోల బ్లాక్ మార్కెటింగ్ వ్యాపారం నగరంలో నిరంతరంగా కొనసాగుతున్నదని, ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఆటో బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి ఫైనాన్షియర్లు షోరూం రేటు యొక్క అసలు ధరను మించకుండ ఆటోలకు ఫైనాన్స్ చేసే విధంగా పరిమితం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి విస్తృత ఏర్పాట్లు : తలసాని శ్రీనివాస్ యాదవ్

సంజీవరెడ్డి నగర్, జూలై 20, ప్రభాతవార్త:

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.సోమవారం ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, మండపం, బ్యారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపులు, తాగునీరు, పారిశుద్ధం తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి కళ్యాణాన్ని వివిధ ప్రాంతాల భక్తులు వీక్షించేందుకు ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.2014కు ముందు సుమారు 20 వేల మంది భక్తులు మాత్రమే హాజరయ్యేవారని, ప్రస్తుతం 7 నుంచి 8 లక్షల మంది వరకు భక్తులు వస్తున్నారని పేర్కొన్నారు. క్యూ లైన్లలో తాగునీటి సదుపాయంతో పాటు ధాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నామని వెల్లడించారు.ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా భక్తులు అధికారులు, వాలంటీర్లకు సహకరించాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు, దేవాదాయ శాఖ, పోలీసు, జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సైఫాబాద్, జులై 20 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన విధంగా హైదరాబాద్ నగరాన్ని దేశానికి రెండోవ రాజధానిగా చేయాలని సౌత్ ఇండియా ఫ్రంట్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే ప్రతి ఏడాది ఏప్రిల్ 1వ తేదీన జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ అధ్యక్షుడు ప్రజాపతి, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవాన్ని జులై 22న నిర్వహించడం దేశ ద్రోహానికి పాల్పడటమే ఆరోపించారు. సుప్రీంకోర్టు బెంచ్‌ను దక్షిణాది రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని, దక్షిణాది అభివృద్ధి మండలిని పునరుద్ధరించాలని, దక్షిణాది భాషా సాంస్కృతిక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని, సౌత్ ఇండియా యుపిఎస్‌సిని ఏర్పాటు చేయాలని, ప్రతి రాష్ట్రానికి ఐటి కారిడార్ ఏర్పాటు చేయాలని, పోలవరం, కాళేశ్వరం ప్రాజెక్టులకు జాతీయ హోదాను కల్పించాలని, ఆ ంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, తెలంగాణ రాష్ట్రానికి ప్యాకేజీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్ చర్ ంచాలని కోరారు.

ఉద్యమకారులకు న్యాయం చేయండి

కోదండరామ్‌కు వినతి పత్రం అందిస్తున్న జెఎసి నేతలు

అల్వాల్, జూలై 20 ప్రభాతవార్త: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ అల్వాల్ జెఎసి నేతలు కోరారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీలోని ఎమ్మెల్సీ కోదండరామ్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షతో కుటుంబాలను వదిలి ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. అల్వాల్ ఈ సేవ కూడలిలో 2011 నుంచి 2014 వరకు ఆచార్య జయశంకర్ దీక్షా శిబిరం వద్ద రిలే నిరాహార దీక్షలు చరిత్రలో నిలిచి పోయిన విషయాన్ని మరువరాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణం ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ ఇతరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కారం : శాంతి శ్రీనివాస్ రెడ్డి

సమస్యలు తెలుసుకుంటున్న శాంతి శ్రీనివాస్ రెడ్డి

అల్వాల్, జూలై 20 ప్రభాతవార్త:

సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని రాజీవ్ వీకర్ సెక్షన్‌లో ఆమె పాదయాత్ర చేశారు. సర్‌లో భాగంగా ఓటరుగా నమోదు కాని వారి పేర్లును జాబితాలో చేర్చే విధంగా సహకరించాలని ఆమె కార్యకర్తలను కోరారు. నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను శాంతి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.

ఎన్యుమరేషన్ ఫారాలు అందజేత

ఓటర్‌లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తున్న రామేశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్, జూలై 20 ప్రభాతవార్త: సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు వారాసిగుడాలో బీ.ఆర్.ఎస్. నాయకులు ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్. సహాయత శిబిరాన్ని బీ.ఆర్.ఎస్. యువ నాయకులు తీగుళ్ళ రామేశ్వర్ గౌడ్ సోమవారం సందర్శించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో ఓటర్లను భాగస్వామ్యాలను చేయడం ద్వారానే అర్హుల ఓట్లు కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చునని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఓటర్ల సహాయానికి సీతాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. కార్యాలయాన్ని సంప్రదించాలని రామేశ్వర్ గౌడ్ సూచించారు.అంతకు ముందు సీతాఫలమండీ కార్యాల యంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్. తీరుతెన్నులపై సమన్వయ కమిటీ ప్రతినిధులతో రామేశ్వర్ గౌడ్ సమీక్షించారు. సమావేశంలో సుందర్,బోర్రా సత్యనారాయణ గౌడ్, జహంగీర్ భాయి పాల్గొన్నారు.

విద్యుత్ లేని ప్రాంతాలు...

బేగంబజార్,జూలై 20 ప్రభాతవార్త: బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా మంగళవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌సిబిడి ఇంజనీర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. గణేష్ టెంపుల్, ఫైర్‌స్టేషన్,గౌలిగూడ 11 ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జిహెచ్ఎంసి క్వార్టర్స్,చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్డు, గురుద్వారాలైన్, అమృత్‌బార్‌లైన్, అశోక్‌బజార్, నేషనల్‌హోటల్,తారహోటల్ లైన్‌తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.11 కెవి కోఠి,సిబిఐ విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు డైరెక్టర్ అండ్ హెల్త్ ఆఫీస్,గుజరాతీగల్లీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగం బజార్ సిబిడి ఇంజనీర్ సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు.

బేడ బుడగ జంగం ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనాథ్

అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న ఆ సామాజిక ఉద్యోగులు

చాంద్రాయణగుట్ట, జులై 20, ప్రభాతవార్త : బేడ బుడగ జంగం ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్ ఎన్నికైయ్యారు. మన్సూరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాతబస్తీ ఫలక్‌నుమా జంగమ్మెట్ నివాసి, పేట్లబుర్జు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీనాథ్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పస్తం ఎల్లయ్య (మహబూబ్‌నగర్), ఉపాధ్యక్షులుగా ఊర రామకృష్ణ (వరంగల్), చెలిమండ్ల శ్రీ రాములు (నల్లగొండ), కోశాధికారిగా తూర్పాటి వెంకటేశ్వర్లు (రంగారెడ్డి), జాయింట్ సెక్రెటరీగా సిరిసాల రామాంజనేయులు (చిట్యాల), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పర్వతం శంకర్ (మహబూబ్‌నగర్)లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తూర్పాటి శ్రీరాములు, శీనయ్య, ధనుంజయలు ప్రకటించారు. నూతన కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు పదవిలో ఉంటుందన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలియైన శ్రీనాథ్ బేడ బుడగ జంగం ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేయగలరన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవాటి శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను అందరూ మెచ్చేలా నిర్వహిస్తానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

అర్జీలను స్వీకరిస్తున్న జెడ్సీ సత్యనారాయణ, అధికారులు

చాంద్రాయణగుట్ట, జులై 20, ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నర్సింహులబ్‌బాగ్‌లోని చార్మినార్ జోన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్సి కన్నం సత్యనారాయణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలలో నెలకొన్న జీహెచ్ఎంసి సమస్యలపై ఫిర్యాదు చేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు నిర్వహించిన ప్రజావాణిలో చార్మినార్ సర్కిల్ నుండి ఇంజనీరింగ్ సమస్యపై ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, జోనల్ ఎఎంసి రాజారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్ పాల్గొన్నారు.

ఘనంగా ఘటోత్సవం

ఘటోత్సవంలో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, జూలై 20 ప్రభాతవార్త: రాణిగంజ్‌లో జరిగిన ఘటోత్సవానికి అతిథిగా హాజరై మసాలా బాబురావు ఎన్నో ఏండ్లుగా స్వాగత స్టేజిను ఏర్పాటు చేస్తున్నారు. ఆ స్వాగత స్టేజి నుండి మోండా డివిజన్ గండి మైసమ్మ ఘటము, రేతీఫైల్ బస్ స్టాప్, రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాల ఘటాలను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నేతలు రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్‌లు పాల్గొన్నారు

డిజిటల్ యుగంలో మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీ అత్యంత కీలకం

-రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్

చిక్కడపల్లి జులై 20, ప్రభాతవార్త : డిజిటల్ యుగంలో మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీ అత్యంత కీలకమైన అంశాలు అని రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ అన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ బాగ్ లింగంపల్లి లా కళాశాలలో నో, గ్లో అండ్ గ్రో అడోలసెంట్ హెల్త్, రైట్స్ అండ్ లైఫ్ స్కిల్స్ పేరుతో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి శిఖా గోయల్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. నేడు సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ వంటి నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. విద్యార్థులు, ముఖ్యంగా యువతులు సామాజిక మాధ్యమాల్లో తెలియని, అనుమానాస్పద వ్యక్తులతో పరిచయాలు, సంబంధాలు పెట్టుకోవద్దు. సైబర్ లోకంలో ఏదైనా ప్రమాదం లేదా వేధింపులు ఎదురైతే భయపడకుండా తక్షణమే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలి. తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న టి సేఫ్, శీ టీమ్స్ సేవలను యువత ఎల్లప్పుడూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంబెడ్కర్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి పి.వి. రమణ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తెరిగి, ఆ జ్ఞానాన్ని వ్యక్తిగత ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని సూచించారు. అంబెడ్కర్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సృజన మాట్లాడుతూ యువతకు జీవన నైపుణ్యాలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా సదస్సులో భారత రాజ్యాంగ పీఠికను చదివి వినిపించి.. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలపై అవగాహన కల్పించారు.రైన్బో హోమ్స్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె. అనురాధ, సీనియర్ జర్నలిస్ట్ ఉషా తూర్ణ, డా. అదితి షా, సీనియర్ హెచ్ఆర్ నిపుణురాలు అర్చన, ప్రిన్సిపాల్ సృజనల ఆధ్వర్యంలో ప్యానెల్ చర్చ జరిగింది.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకారం అందించాలి : సీఐ నవీన్‌కుమార్

యూసుఫ్‌గూడ, 20 జులై, ప్రభాతవార్త :

సీఐ నవీన్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గాయిత్రినగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవరింటి మస్తాన్‌రెడ్డి.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసలతో పాటు ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని అల్లాపూర్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. నూతనంగా అల్లాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సీఐ నావీన్‌కుమార్‌ను గాయిత్రినగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవరింటి మస్తాన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. డివిజన్ పరిధిలోని బస్తీల కాలనీలలో ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహించి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూడాలని కోరారు. ఎలాంటి అవాంచనీయ, అనుమానాస్పద సంఘటనలు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించేలా ముందుకు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవీందర్ ముదిరాజ్, సతీష్‌రెడ్డి, పవన్‌కుమార్, శర్మ, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన

కంటోన్మెంట్, జూలై 20 ప్రభాతవార్త:

అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కార్ఖానాలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కీలక అడుగు పడింది. పాఠశాల అభివృద్ధికి మంజూరైన రూ. 30 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ లాంఛనంగా శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థినులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ఈ ప్రత్యేక నిధులతో పాఠశాలలో అవసరమైన ఆధునికీకరణ పనులు, ఇతర మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్, జూలై 20 ప్రభాతవార్త:

ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఇక్కడ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు, ఫారాలను నింపించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, సూచనలను తెలుసుకొని, అవసరమైన చోట తక్షణ సహాయం అందించాలని సూచించారు.

రాజ్‌పాల్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

చాంద్రాయణగుట్ట, జులై 20, ప్రభాతవార్త : హరిబౌలి డివిజన్ రాజ్‌పాల్‌నగర్‌లో సుమారు 11లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీరోడ్లు, ఎస్ఎస్ ఫ్లోరింగ్, రేక

బిజెపిలో చేరిన రిటైర్డ్ ఏఎస్ఐ కిషన్‌లాల్

కిషన్‌లాల్‌కు బిజెపి కండువా కప్పుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

సైదాబాద్, జులై 20 ప్రభాతవార్త:

ఐఎస్ సదన్ డివిజన్ విష్ణునగర్‌కు చెందిన బి.కిషన్‌లాల్ భారతీయ జనతాపార్టీలో చేరారు. బిజెపి కార్యాలయంలో బిజెపి సీనియర్ సిటిజన్స్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుభాష్ చందర్జీ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో ఆయన బిజెపిలో చేరారు. అనంతరం కిషన్‌లాల్ మాట్లాడుతూ బిజెపిని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో 40 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన కిషన్‌లాల్ అంబర్‌పేటలోని ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఎస్ఐగా పదవీ విరమణ పొందారు.

బాలుడి డైరీ పోలీసులకు అప్పగింత

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాది కరుణాసాగర్

సైదాబాద్, జులై 20 ప్రభాతవార్త: సైదాబాద్ సక్సెస్ స్కూల్ ఘటనలో కీలక సాక్ష్యంగా ఉన్న బాలుడి డైరీని బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు అప్పగించారు. డైరీ కోసం గుర్తు తెలియని వ్యక్తులు రెక్కీ నిర్వహిస్తున్నారని బాలుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా బాలుడి కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్, నిరంజన్ యాదవ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, అందెల శ్రీరాములు పోలీసులను కోరారు.

అండగా ఉంటాం : చికోటి ప్రవీణ్

సక్సెస్ పాఠశాల ఘటనలో బాధిత బాలుడి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని,వారికి అండగా ఉంటామని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ అన్నారు. సైదాబాద్‌లోని బాలుడి కుటుంబ సభ్యులను కలిసిన ఆయన వారికి భరోసా కల్పించారు.

ఎస్ఆర్ఐ ప్రక్రియను పరిశీలించిన జెడ్‌సి వికాస్ మహతో

బీఎల్ఓలతో మాట్లాడుతున్న జెడ్‌సీ వికాస్ మహతో

హుడాకాంప్లెక్స్,20 జులై, ప్రభాతవార్త : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, ఎల్‌బీనగర్ నియోజకవర్గం, గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ కాలనీలోని శ్రీ రామాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాన్ని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో(ఐఎఎస్) సోమవారం పరిశీలించారు. బీఎల్ఓల సనితీరు, ఎన్యూమరేషన్ ఫారాలను అయన తనిఖీ చేశారు. బీఎల్ఓ హాజరు, ధరఖాస్తుఫారాలు నింపే విధానం, నింపిన ఫారాలను సక్రమంగా స్వీకరించడం, ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం వంటి అంశాలపై ఇంచార్జీ బాబురావుకు సూచనలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం గుర్తించాలని తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చే ధరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, సంబధిత ఎన్నికల రిటర్నింగ్ సిబ్బంది. స్థానిక బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకమయి నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో రాచకొండ కిష్టయ్య ప్యానల్ ఘన విజయం

ద్వారకమయి నగర్ నూతన కమిటీ ప్రతినిధులు

వనస్థలిపురం జులై20,ప్రభాతవార్త :

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకమయి నగర్ నివాసుల సంక్షేమ సంఘానికి జరిగిన ఎన్నికలలో రాచకొండ కిష్టయ్య ప్యానల్ ఘన విజయం సాధించింది. సంఘం అధ్యక్షుడు గా కిష్టయ్య తమ సమీప అభ్యర్థి సురేందర్ పై 142 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదేవిధంగా కిష్టయ్య ప్యానల్ నుండి పోటీ చేసిన 8 మంది గెలుపొందారు. ఉపాధ్యక్షులు గా వి.మనోహర్ దేవి,పి.వెంకటేష్ యాదవ్,సెక్రెటరీ గా ఎం. ఎం. రావు,ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా జి.మల్లేష్ గౌడ్,జాయింట్ సెక్రెటరీ లు గా శ్రీ విష్ణు మూర్తి, వై.రాజ్ కుమార్, కోశాధికారిగా కె.సునీత లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానన్నారు. కాలనీలో మిగిలిన అభివృద్ధి పనులు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తో పూర్తి చేస్తానన్నారు.తమపై నమ్మకంతో గెలిపించిన కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నూతన కమిటీ ఏర్పాటు పై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కిష్టయ్య గతంలో గుండ్రామ్ పల్లి సర్పంచిగా,సింగిల్ విండో చైర్మన్ గా పనిచేశారు. ఈకార్యక్రమంలో మన్నే రాజేందర్ రెడ్డి,బి.శ్రీనివాసరావు, ఏ.వి.సుబ్బారెడ్డి, రామచంద్రరావు,శ్రీనివాస్ మూర్తి.తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లాలి

మల్కాజిగిరి జూలై 20,ప్రభాతవార్త :

ఆనంద్ బాగ్ కార్యాలయంలో మల్కాజ్గిరి నియోజకవర్గం ఎస్ఐఆర్ ఆగస్టు 3 చివరి తేది కావడంతో ప్రతి ఒక్క కార్యకర్త ఇంటింటికి వెళుతూ పని చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు ఇచార్జీలు కార్యకర్తలు బిఎల్ఎలు ఆగస్టు 3వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్ కుమార్ ,జితేంద్రనాథ్ ,నియోజక వర్గం ఇంచార్జ్ తోట లక్ష్మికాంత్ రెడ్డి ,బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్,జి ఎన్వి సతీష్ కుమార్,ఎస్ ఆర్ ప్రసాద్,రాందాస్ సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్ వైనాల ప్రవీణ్, సత్యమూర్తి వినోద్ యాదవ్, యూసుఫ్ భాయ్,పిట్టల నాగరాజు, శ్రీకాంత్, ఆశా, ఇందిర ప్రియద ర్శిని, శారద,సుమలత యాదవ్, కనకలక్ష్మి, పుష్పలత, సిరిగిరి రాజు, సనాది శంకర్, సందీప్ గౌడ్,పార్థ, బాల్ రాజ్ యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్, కుట్టి శ్రీనివాస్,బాబు,సత్యనారాయణ,బ్రహ్మయ్య,శ్రీరామ్,ఇస్తారి, పాల్గొన్నారు

15 ఏళ్ల స్మశాన వాటిక వివాదానికి తెర.. గౌడ సంఘానికి న్యాయం

-రూ.50 లక్షల నిధులతో గౌడ సంఘం స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్ మెట్, జులై 20,ప్రభాతవార్త :

ఓల్డ్ నేరేడుమెట్ గౌడ సంఘానికి చెందిన స్మశాన వాటిక స్థలం విషయంలో గత పదిహేనేళ్లుగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. న్యాయస్థానం గౌడ సంఘానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, ఆ తీర్పు అమలుకు స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో స్మశాన వాటిక స్థలాన్ని గౌడ సంఘానిదిగానే గుర్తిస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ అధికారిక ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో దశాబ్ద కాలానికి పైగా నెలకొన్న అనిశ్చితికి తెరపడటంతో గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి గౌడ సంఘానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ, స్మశాన వాటిక స్థలం విషయంలో గౌడ సంఘం సభ్యులు పదిహేనేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదని, చివరకు న్యాయస్థానం తీర్పు వచ్చిన అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే జోనల్ కమిషనర్‌ను కలిసి కోర్టు తీర్పు ప్రతులను అందజేయడంతో అధికారులు సానుకూలంగా స్పందించి ప్రొసీడింగ్స్ జారీ చేశారని తెలిపారు. ఈ విజయానికి ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. జోనల్ కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేకు, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం పెద్దలు మాట్లాడుతూ, కోర్టు కేసు ప్రారంభమైన నాటి నుంచి ప్రతి దశలో తమకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ న్యాయం జరిగేలా కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి, సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కోర్టు తీర్పు, అధికారిక ప్రొసీడింగ్స్ జారీ కావడంతో సుమారు వంద గౌడ కుటుంబాల సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్‌లను ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్, గౌడ సంఘం పెద్దలు టి.వి. నరేందర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, పవన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, జే.కే. సాయి గౌడ్, విశ్వనాథ్ గౌడ్, అభిషేక్ గౌడ్, జహంగీర్ గౌడ్, గిరి గౌడ్, గంగాధర్ గౌడ్, వినోద్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్, కోటేశ్వర్, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్ గౌడ సంఘానికి చెందిన పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

రహదారులకు ఇరువైపులా చెత్తను వెంటనే తొలగించాలి : కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి జూలై 20,ప్రభాతవార్త :

రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, హోటల్ వద్ద చెత్త డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం మల్కాజిగిరి , మౌలాలి తదితర కాలనీలలో కమిషనర్ పర్యటించారు. సందర్భంగా పారిశుద్ధం పట్టణ ప్రణాళిక ఘన వ్యర్థాల నిర్వహణ కూల్చివేత వ్యర్థాల నిర్వహణ పచ్చదనం పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాషిత విభాగం అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించి హోటల్ వద్ద రహదారుల వద్ద చెత్తను తొలగించాలన్నారు. చికెన్ నిర్ధారణ నిర్మాణకం శాస్త్రీయంగా పారవేసే విధంగా అమలు చేయాలన్నారు. చికెన్ మటన్ షాప్ ల వద్ద ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని , చికెన్ మటన్ షాప్ ల వద్ద వ్యర్థాల రహదారులపై వేస్తే వీధి కుక్కలు వస్తాయని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరి బొండాల వ్యక్తి వచ్చే కొబ్బరి తొక్కలను కొబ్బరి తోకలను పీచు తయారీ సంస్థలకు అందించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు . అపార్ట్మెంట్లు రహదారులపై ప్రత్యేక పారిశుద్ధత ద్వారా తొలగించాలని, స్వచ్ఛ ఆటలకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల సేకరణ కోసం రామ్ కి సిబ్బంది, అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.. ప్లాంటేషన్ మొక్కలకు అవసరమైన ట్రీ గార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ లకు వాణిజ్య సహకార సంస్థల సహకారంతో మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశించారు.

చిలుకానగర్ రోడ్ల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే వినతి

ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, జూలై 20 ప్రభాతవార్త : చిలుకానగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా చిలుకానగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్, అభయాంజనేయ స్వామి గుట్ట, మైసమ్మ గుడి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు, డ్రైనేజీ నీటి అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. అదే విధంగా చిలుకానగర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు రోడ్డు పనులకు ఇప్పటికే ఆమోదం లభించినప్పటికీ, మధ్య వరకు మాత్రమే రోడ్డు వేసి మిగిలిన భాగాన్ని తప్పి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో బోనాల పండుగ నేపథ్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, రహదారి పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా గారికి వినతిపత్రం అందజేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కోరారు. ఈ కార్యక్రమంలో చిలుకానగర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఈడి పంకజతో ఎమ్మెల్యే బేటి :

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల దుస్థితి పరిష్కరించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు జలమండలి ఈడి పంకజను కలిసి విన్నవించారు. నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే ఆమోదించి, ప్రాధాన్యత ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, సక్రమమైన మురుగునీటి పారుదల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మారుతీనగర్ ఆఫీసర్స్ కాలనీ పార్కు స్థలాన్ని పరిరక్షించాలి

-బిజెపి వినూత్న నిరసనకు ఫలితం

ఎల్.బి.నగర్, జులై 20 ప్రభాతవార్త:

నర్మిల్ కార్యాలయం ముందు వినూత్న నిరసన చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీనగర్, ఆఫీసర్స్ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానిక ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజావాణి కార్యక్రమంలో ఎల్బీనగర్ అసెంబ్లీ బీజేపీ పార్టీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ సర్కిల్ కార్యాలయం ఎదుట వంటా వార్పు చేస్తూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు గత కొన్ని రోజులుగా పార్కు స్థల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీజేపీ నాయకుల నిరసనకు స్పందించిన అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని, పార్కు స్థలాన్ని పరిరక్షిస్తామని, అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణం చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పార్కు స్థలాన్ని జెసిపి సహాయంతో శుభ్రం చేయడం జరుగుతుందన్నారు.కాలనీ ప్రజలకు ఎంతో అవసరమైన పార్కు స్థలాన్ని కాపాడేందుకు నిరంతరం కృషి చేసిన ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, మొద్దు లచ్చి రెడ్డికి, బిజెపి నాయకులు, కార్యకర్తలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, హస్తినాపురం అధ్యక్షులు మల్లేష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు, నాయకులు అంజన్ కుమార్ గౌడ్, విజయ్ కుమార్, నూతి శ్రీనివాస్, ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేష్ గౌడ్, భార్గవ్ తేజ, మహిళా కవితారెడ్డి, శంకరయ్యగౌడ్, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,రవి శంకర్, కృష్ణారెడ్డి, సంగమేశ్వర్, శ్రీనివాసరావు, కిషోర్, విజయ్ కుమార్, నరసింహ, సిద్దేశ్వర్, రఘువీర్, గిరి, దుర్గా, వినోద్, కాలనీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, బాలాజీ, వెంకట్ రెడ్డి, నాయుడు, శ్రీనివాస్, అనిల్ కుమార్, అరుణ, దుర్గ, స్వాతి, సత్య, ఉమా, శారద, బిందు, సత్యవేణి, మాధవి, భార్గవి, యాదమ్మ, సుచిత్ర, సరిత, ప్రసన్న, అశ్విని, సునీత, శ్రీ మాల, మహేశ్వరి, రమ్య, నాగలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్లేస్‌మెంట్స్‌పై అవగాహన సదస్సు

ప్లేస్‌మెంట్స్ పై అవగాహన కల్పిస్తున్న జెఎన్‌యుటి ప్రొఫెసర్

సరూర్‌నగర్, జూలై 20 ప్రభాతవార్త: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒకటైన మీర్‌పేట్ టిఆర్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో సోమవారం ప్లేస్‌మెంట్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు జాబ్ మార్కెట్, ప్లేస్‌మెంట్స్, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలను సాధించడం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడానికి టిఆర్ఆర్ కాలేజీ యాజమాన్యం హైదరాబాద్ టిసిఎస్ బృందంచే ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా టిసిఎస్ నిపుణులతో పాటు, ప్రత్యేక అతిథిగా హాజరైన జెఎన్‌టియుకు చెందిన ప్రొఫెసర్, విద్యావేత్త విష్ణువర్ధన్ ఆయా అంశాలపై విద్యార్థులకు వివరించి దిశా నిర్దేశనం చేశారు. క్యాంపస్ సెలక్షన్లు కావడం ఎలా? ఉద్యోగాలు సాధించడానికి అవసరమయ్యే స్కిల్స్, ఇంటర్వ్యూల విధానం, కమ్యూనికేషన్స్ నైపుణ్యాలు, టెక్నికల్ పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, ఉద్యోగాలు సాధించడానికి సన్నద్ధత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు వారు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉద్యోగ విపణిలో విజయవంతం కావడానికి అవసరమయ్యే స్కిల్స్‌పై వారు దిశా నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ మధుసూదన్‌రావు, వివిధ విభాగాల హెచ్ఓడిలు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద వేగవంతంగా అభివృద్ధి పనులు : ఏఇ వెంకన్న

గాంధీ నగర్‌లో ఆలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏఇ వెంకన్న, చిత్రంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచందర్ తదితరులు

మలక్ పేట, జూలై 20,ప్రభాతవార్త:

రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాల వద్ద వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఏఇ వెంకన్న తెలిపారు.అస్మాన్ ఘడ్ గాంధీనగర్ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జిహెచ్ఎంసి ఏఇ వెంకన్న స్థానిక సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.రాంచందర్ తో పాటు కమిటీ ప్రతినిధులు ఏఇ వెంకన్న కు వివరించారు. బోనాల పండుగ ప్రారంభానికి ముందే దేవాలయం వద్ద అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని ఏఇ వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సంక్షేమ సంఘం కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి కుమార్, కోశాధికారి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జి ఎస్జీఎస్‌గా చిలకా నర్సింహారెడ్డి

మలక్ పేట, జూలై 20,ప్రభాతవార్త:

హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ ఛార్జ్(ఎఫ్ఎసి)గా చిలకా నర్సింహారెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. ఎస్జీఎస్ గా విధులు నిర్వహించిన అపర్ణ గుడిమల్కాపూర్ మార్కెట్ కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో చిలకా నర్సింహారెడ్డి ఇంచార్జి ఎస్జీఎస్ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఇంచార్జ్ ఎస్జీఎస్ గా బాధ్యతలు చేపట్టిన చిలకా నర్సింహారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరిస్తామని తెలిపారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పలు వ్యాపారస్తులపై కేసు నమోదు

లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న బేగంపేట వ్యాపారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఇంచార్జి ఎస్జీఎస్ చిలకా నర్సింహా రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల క్రితం సంబంధిత వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినప్పటికీ పట్టించుకోకుండా వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తుండడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగింది నిజమేనని తెలిపారు.సుమారు 17 మందిపై గోషామహల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని వివరించారు.

స్వగ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

స్వగ్రామం కౌకుంట్ల పోలింగ్ కేంద్రంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిస్తున్న సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి

సరూర్‌నగర్, జూలై 20 ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారె డ్డి, ఆమె తనయుడు రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు చేవెళ్ల మండలంలోని తమ స్వగ్రామం కౌకుంట్లలో ఎన్యూమరేషన్ ఫారాలు పూరిం చారు. సొంతూరుకు వచ్చిన వారు స్థానిక బూత్‌లో ఎన్యూమరేషన్ ఫారాలు నింపి అక్కడి బిఎల్ఓకు అందజేశారు. ఈ మేరకు స్థానిక బిఎల్ఓ సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలకు సంబంధించి ఫారాలను స్వీకరించి అనంతరం డిజిటలైజేషన్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణ దేశానికి మంచిది : దత్తాత్రేయ

దత్తాత్రేయను కలిసి సన్మానిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, జూలై 20 ప్రభాతవార్త: బిజెపి అగ్రనేత, మాజీ కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన తెలంగాణ బిజెపి రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం దత్తన్న నివాసానికి తరలివెళ్ళిన శంకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్